
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య జిల్లా వార్తలు




కొత్తపేటలోని వీధిలో పేరుకుపోయిన చెత్త


రాయచోటి పట్టణంలో అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి


కొత్తపేట వాటర్ ట్యాంకర్ వద్ద నీటిని కొనుగోలు చేస్తున్న మహిళలు

రోడ్లపై మురుగునీరు.. పేరుకుపోయిన చెత్త

గత వైసీపీ ప్రభుత్వం హడావిడిగా జిల్లాలను విభజించి జిల్లా కేంద్రాలను ప్రకటించింది. కానీ ఆ కేంద్రాల అభివృద్ధిని మాత్రం పక్కనపెట్టేసింది. పేరుకే రాయచోటి జిల్లా కేంద్రమైనా వసతులు చూస్తే పంచాయతీల కన్నా అధ్వానంగా ఉన్నాయన్న విమర్శలున్నాయి. ప్రధాన రహదారులను మాత్రం శుభ్రం చేసే పారిశుధ్య కార్మికులు చిన్న చిన్న సందులను పట్టించుకోకపోవడంతో అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో ఆ నీరంతా రోడ్లపైనే పారుతోంది. ఏళ్ల తరబడి రింగ్ రోడ్డు సమస్య అలాగే ఉంది. వైసీపీ ప్రభుత్వం ఎలాగూ పట్టించుకోలేదు.. కనీసం కూటమి ప్రభుత్వ పెద్దలైనా రాయచోటి ప్రజల సమస్యలను పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.


కొత్తపేట చర్చి వీధి సమీపంలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

- జిల్లా కేంద్రంలో సమస్యల తిష్ఠ
- అసంపూర్తిగా జాతీయ రహదారి, రింగురోడ్డు పనులు
- ప్రధాన రోడ్లకే పరిమితమవుతున్న పారిశుధ్య కార్మికులు
- ఇదీ రాయచోటి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ దుస్థితి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పేరుకే రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రం. అభివృద్ధి చూస్తే అంతంత మాత్రంగానే ఉంది. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ నడిబొడ్డులో వెళుతున్న నాలుగు వరుసల రహదారి అసంపూర్తిగా మిగిలిపోయింది. 2007-08 సంవత్సరాల్లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి పట్టణం చుట్టూ చేపట్టిన ఔటర్ రింగ్ రోడ్డు పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. గత ఐదు సంవత్సరాలు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ టీడీపీ హయాంలో మంజూరైన జాతీయ రహదారి పనులను, డ్రైనేజీ పనులు పూర్తి చేయకుండా కొన్ని చోట్ల అలాగే వదిలేశారు. దీనికి తోడు రాయచోటి మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ఎక్కడ పడితే అక్కడ మురుగునీరు డ్రైనేజీలు నిండిపోయి రోడ్లపైన పారుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇదిలా ఉండగా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చెత్తాచెదారాన్ని తొలగించాల్సిన పారిశుధ్య కార్మికులు ప్రధాన రోడ్లకే పరిమితం అవుతుండడంతో పలు వీధులతో పాటు సందు గొందుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకే స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ అయినప్పటికీ ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు మున్సిపాలిటీ నుంచి సరైన సౌకర్యాలు అందడంలేదు. నీటిపన్ను, ఇంటి పన్ను, చెత్త పన్ను, గ్రంథాలయం పన్ను ఇలా అన్నిరకాల పన్నులను ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నా మున్సిపల్ అధికారులు ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పలు ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

అస్తవ్యస్త డ్రైనేజీలు

ప్రధానంగా కొత్తపల్లి, కొత్తపేట, బోస్‌నగర్, కొత్తపేట రామాపురం, పాతరాయచోటి, బిరాన్‌సాబ్‌వీధి, మార్కెట్ వీధి తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వల్ల వారంలో ఒకటి, రెండుసార్లు డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. ముఖ్యంగా కొత్తపేటలోని చర్చి వీధి, సరస్వతి వీధి, రాజు స్కూల్ సమీపంలో డ్రైనేజీ నీరు రోడ్లపైకి వస్తున్నా మున్సిపల్ అధికారులు మాత్రం అక్కడ శాశ్వత చర్యలు చేపట్టడం లేదని ప్రజలు చెబుతున్నారు.

తాగునీరు కొనాల్సిందే..

వెలిగల్లు ప్రాజెక్టు నుంచి రాయచోటి పట్టణానికి వచ్చే తాగునీటిని కూడా నాలుగు రోజులకు, ఐదు రోజులకు, వారం రోజులకు ఇలా ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో విధంగా ఎలా పడితే అలా సరఫరా చేస్తుండడమే కాకుండా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ వెలిగల్లు ప్రాజెక్టు వద్ద నీటిని శుద్ధి చేస్తున్నప్పటికీ ఆ నీరు తాగేందుకు పనికి రాకపోవడంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు నేటికీ వాటర్ ట్యాంకర్ల వద్ద నీటిని కొనుగోలు చేస్తూనే ఉన్నారు. దీనిని బట్టి చూస్తే రాయచోటి మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారమైన దాఖలాలు కనిపించడం లేదు. మున్సిపల్ అధికారులు మాత్రం వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నీటిని శుద్ధి చేసి ప్రజలకు ఇబ్బందిలేకుండా నీటిని సరఫరా చేస్తున్నామంటూ లక్షలాది రూపాయలు బిల్లులు చేసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారే కానీ ప్రజలకు నీటిని సక్రమంగా సరఫరా చేసిన పరిస్థితులు కనిపించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

అసంపూర్తిగానే రింగ్‌రోడ్డు పనులు

2007 సంవత్సరంలో చేపట్టిన రింగు రోడ్డు పనులు ఇంకా కొన్ని చోట్ల పెండింగ్‌లో ఉండగా 2017 సంవత్సరంలో ప్రారంభించిన జాతీయ రహదారి పనులు నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. 2007 నుంచి 2024 వరకు ఎమ్మెల్యేగా కొనసాగిన శ్రీకాంత్‌రెడ్డి హయాంలో అటు రింగు రోడ్డు పనులు గానీ, ఇటు జాతీయ రహదారి పనులు గానీ పూర్తి చేయకపోవడంపై పట్టణ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక గ్రామపంచాయతీగా ఉన్న రాయచోటి మున్సిపాలిటీగా, గ్రేడ్-1 మున్సిపాలిటీగా, స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ పట్టణ ప్రజలకు సౌకర్యాలు మాత్రం ఆ స్థాయిలో లేకపోవడంతో మున్సిపాలిటీ కంటే గ్రామ పంచాయతీనే నయం రా దేవుడా అంటూ పట్టణ ప్రజలు మున్సిపల్ పాలకవర్గంతో పాటు అధికారులపై మండిపడుతున్నారు. దీనికి తోడు 2017 సంవత్సరంలో రాయచోటి పట్టణంలోని ఎస్‌ఎన్ కాలనీలో జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రాస్‌ల్యాండ్ స్థలంలో ఆక్రమణలు తొలగించి అక్కడ ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా అలాగే వదిలేయడంతో ప్రస్తుతం ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారింది. అంతేగాక గత ప్రభుత్వంలో ఆర్భాటంగా జాతీయ రహదారిపై నేతాజీ సర్కిల్, ఠాణా తదితర ప్రాంతాల్లో వాహనాలు యూటర్న్ కోసం తొలగించి అక్కడ ఎటువంటి పనులు చేపట్టకుండా అలాగే వదిలేశారు. నేడు ఆ ప్రాంతంలో తిరిగి నిర్మాణాలు చేపడుతున్నారు. అంతేగాక జాతీయ రహదారిలో అక్కడక్కడా కూడళ్లలో ఏర్పాటు చేసే విగ్రహాలు నిలిపి ప్రారంభించకుండానే వదిలేశారు. చెన్నముక్కపల్లె రింగురోడ్డు వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టి రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్‌లపై విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటికి కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఆ వీధిలైట్లు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఇలా చెప్పుకుంటూపోతే పేరుకే జిల్లా కేంద్రమైనప్పటికీ ఇక్కడ సౌకర్యాలు మాత్రం ఆశించిన స్థాయిలో కల్పించడంలో మున్సిపల్ పాలకవర్గంతో పాటు మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వంలో అస్తవ్యస్తంగా మారిన రాయచోటి మున్సిపాలిటీని ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా గాడిలో పెట్టి మున్సిపాలిటీలోని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కూటమి ప్రభుత్వ నేతలను కోరుతున్నారు.


రాయచోటి పట్టణ పరిధిలోని చిత్తూరు రోడ్డులో అసంపూర్తిగా ఉన్న రింగు రోడ్డు పనులు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



బీసీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- బీసీల సహకారం వల్లే కూటమి ప్రభుత్వం ఘనవిజయం
- బీసీలకు అన్ని రంగాల్లో మొదటి ప్రాధాన్యం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని అజయ్ కన్వెన్షన్ హాల్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహాసభకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బీసీల పక్షపాతిగా బీసీల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారన్నారు. మూడు పర్యాయాలు చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు బీసీల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. బీసీల సహాయ సహకారాల వల్ల కూటమి ప్రభుత్వం అత్యధిక స్థానాల్లో ఘన విజయం సాధించిందని, రాబోయే రోజుల్లో బీసీలకు ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత కల్పించి వారి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. తెలుగుదేశంపార్టీ బలహీన వర్గాల పార్టీ అని, రాయచోటి నియోజకవర్గంలో జరిగే ప్రతి కార్యక్రమంలో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బీసీలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. గత ఐదు సంవత్సరాలు పరిపాలన చేసిన వైసీపీ ప్రభుత్వం బీసీలకు ఎటువంటి గుర్తింపు ఇవ్వకుండా వారిని వాడుకొని వదిలేసిందని తెలిపారు. నియోజకవర్గంలోని బీసీలు తమ మీద చూపిన అభిమానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నేతలతో పాటు రాయచోటి నియోజకవర్గ బీసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వీరుడు.. ఛత్రపతి శివాజీ



- నగరంలో అట్టహాసంగా శోభాయాత్ర

కడప కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): హిందూ సామ్రాజ్య స్థాపన కోసం మనదేశంలోకి వచ్చిన విదేశీ దురాక్రమణదారుల పీచమణచిన వీరుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని ఎమ్మెల్యే మాధవి కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని ఛత్రపతి శివాజీ మరాఠా సేవా సంఘ్, ఛత్రపతి శివాజీ ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు కడప నగర పురవీధుల గుండా శోభాయాత్ర ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి హాజరై శివాజీ విగ్రహానికి హారతి ఇచ్చి రథాన్ని లాగి యాత్రను ప్రారంభించారు.

సోలార్ బాధితులకు న్యాయం చేస్తాం

- పనులను అడ్డుకోవడం సరికాదు : ఆర్డీవో

గాలివీడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటులో భాగంగా భూములు కోల్పోయిన బాధితులకు తగిన న్యాయం చేస్తామని ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండలంలోని తూముకుంట గ్రామంలో అదనంగా ఏర్పాటు చేస్తున్న 500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టు పనులను ఆయన తహసీల్దార్ భాగ్యలతతో కలిసి పరిశీలించి రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్ అదనపు ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వ భూమిలో నిర్మాణం పనులు జరుగుతుండగా కొందరు స్థానికులు పదే పదే అడ్డు తగలడం సరికాదన్నారు. ఆ భూములు వారి అనుభవంలో ఉన్నట్లుగా ఆధారాలు ఉంటే వారితో చర్చించి వారికి ప్రత్యామ్నాయంగా అసైన్‌మెంట్‌లో భూమిని కేటాయిస్తామన్నారు. ఇదిలా ఉండగా తూముకుంట దిగువమూల, ప్రకాశ్‌నగర్‌కాలనీ వాసులు తమ అనుభవంలో ఉన్న భూములను సోలార్‌కు కేటాయించడం ద్వారా 40 కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుర్రాలమిట్ట వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన రేకులషెడ్ల తొలగింపునకు తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆర్డీవో ఆదేశించారు. రేకులషెడ్లు ఆర్‌అండ్‌బీలో ఉన్నాయా..? లేక గయ్యాలా...? అనే విషయంపై చర్చించి ఆ శాఖాధికారులు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, ఎస్ఐ రామకృష్ణ, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.


తూముకుంటలో సోలార్ ప్లాంట్ గురించి తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

బెరైటీస్ గనులను కాపాడుకుందాం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మంగంపేట గనులను శాఖలోని దొంగల నుంచి కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరులో ఏఐటీయూసీ మొదటి జిల్లా మహాసభలు నిర్వహించారు. మొదటిగా సీపీఐ కార్యాలయం నుంచి ఎస్‌ఎల్‌సీ పాఠశాల వరకు భారీ ర్యాలీ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాక్రిష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎండీసీ మొదటి నుంచి బెరైటీస్ కొనుగోలు చేస్తున్న కొనుగోలుదారులకు ఎక్స్‌పోర్టు పరిమితిని తగ్గించి అందరికీ సీ, డీ, డబ్ల్యూ టెండర్స్‌లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.


రైల్వేకోడూరులో ర్యాలీ చేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు

రూమ్ నంబర్ : 10

- ఈ రూమ్ సంథింగ్ స్పెషల్..
- నెలవారీ బాడుగ రూ.1.27 లక్షలు
- గతంలో రూ.1800
- వేలం పాటలో దక్కించుకున్న వ్యాపారి

గుర్రంకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో ఒక రూంను వేలం పాటలో రూ.1.27 లక్షలకు దక్కించుకున్నాడు ఓ వ్యాపారి. గతంలో అయితే రూం బాడుగ కేవలం రూ.1800 మాత్రమే. ఈ మార్కెట్ యార్డులో టమోటా వ్యాపారం చేసి రూంల బాడుగలు కట్టలేక చాలామంది వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ యార్డులో ఓ రూం కొన్ని రోజులుగా ఖాళీగా ఉంది. ఈ రూంకు మార్కెట్ శాఖాధికారులు శనివారం వాల్మీకిపురంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఆ రూం మార్కెట్ యార్డు చరిత్రలో ఎక్కడా లేని విధంగా రూ.1.27 లక్షల బాడుగ వసూలు చేసింది. మార్కెట్‌లో రూంను దక్కించుకొన్న వ్యాపారి మూడు నెలల బాడుగను ఒకేసారి చెల్లిండంతో మిగిలిన వ్యాపారులు అవాక్కయ్యారు. గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో 52 మంది వ్యాపారులు ఉన్నారు. ఈ క్రమంలో వ్యాపారులకు అనుగుణంగా రూంలు లేకపోవడంతో కొందరు వ్యాపారులు సొంత నిధులతో రేకుల షెడ్లు వేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మార్కెట్ యార్డులో రూం నంబరు-10 కొంత కాలంగా ఖాళీగా ఉంది. మార్కెట్ యార్డు ప్రారంభంలో ఓ వ్యాపారి వేలం పాటలో దక్కించుకుని బాడుగ రూ.1100 చెల్లిస్తూ వ్యాపారం చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో ఆ వ్యాపారి చనిపోవడంతో కొన్నేళ్లుగా అది ఖాళీగా ఉంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ రూంను చైర్మన్ బంధువులకు ఇచ్చారు. అప్పట్లో రూం బాడుగను రూ.1800 పెంచారు. వైసీపీ నాయకుల వర్గపోరుతో చైర్మన్‌కు రూమ్ ఇవ్వరాదంటూ అప్పట్లో ఎమ్మెల్యే, ఎంపీల వద్ద పెద్ద ఎత్తున మంతనాలు చేయడంతో దానిని ఖాళీగా ఉంచారు. దీంతో ఓ వ్యాపారి ఆ రూము విషయమై కోర్టును ఆశ్రయించడంతో బహిరంగ వేలం పాట నిర్వహించాలని మార్కెట్ శాఖ అధికారులను కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మార్కెట్ యార్డులో ఖాళీగా ఉన్న రూమ్‌కు వేలం పాటను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 15వ తేదీ వాల్మీకిపురం మార్కెట్ కార్యాలయంలో జేడీ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ప్రభుత్వం ఆ రూంకు రూ.9 వేలతో పాట మొదలు పెట్టింది. ఈ క్రమంలో వ్యాపారుల మధ్య పోటీ పెరగడంతో కోర్టును ఆశ్రయించిన వ్యక్తులే హెచ్చు పాట పాడారు. ఈ వేలం పాటలో రూం నెంబరు-10ని నెలసరి బాడుగ రూ.1,27,100 లక్షలకు సీఎస్ ఖరీష్మా అనే వ్యాపారి దక్కించుకున్నాడు. మార్కెట్ యార్డు చరిత్రలోనే అత్యంత ఎక్కువ బాడుగ చెల్లించే రూంగా అది నిలిచింది.

అద్దె చెల్లించాల్సిందే..

మార్కెట్ యార్డులో వ్యాపారులు వేలం పాటలో దక్కించుకున్న గదులకు అద్దె చెల్లించాల్సిందే. అలాగే రూం నెంబరు-10కి ప్రతి నెలా బాడుగ రూ.1,27,100 చెల్లించాల్సిందే. ఇప్పటికే రూమ్ దక్కించుకున్న వ్యాపారి మూడు నెలల అద్దె రూ.3,81,300 చెల్లించాడు. అద్దె చెల్లించని పక్షంలో అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- కుమార్‌రెడ్డి, మార్కెట్ యార్డు కార్యదర్శి, వాల్మీకిపురం



లక్షలు అద్దె వసూలు చేస్తున్న రూం నంబరు-10

గడ్డివాములు, బైకులు దగ్ధం



వేంపల్లెలో దగ్ధమవుతున్న గడ్డివాములు

వేంపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం పులివెందుల-రాయచోటి రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో రెండు గడ్డివాములు, బైకులు దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లింది. షేక్ దూద్ పీర్ గడ్డివ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తుంటారు. ఆదివారం ఉదయం ఎవరో నిప్పుపెట్టడంతో మంటలు ఎగిసపడ్డాయి. చుట్టుపక్కల వారు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా... రెండు గడ్డివాములు పక్కనే పార్క్ చేసి ఉంచిన బైకులు కాలిపోయాయి. అగ్నిప్రమాదంతో తీరని నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు దూద్‌పీర్ కోరుతున్నాడు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కడప క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సరోజినీ నగర్‌లో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. సరోజినీనగర్‌లో నివాసం ఉంటున్న షేక్ షబ్బీర్ (35) టైల్స్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని సంవత్సరాలుగా మద్యంకు అలవాటుపడి పనికిపోయి వచ్చిన డబ్బులు ఇంట్లో ఇవ్వకుండా తాగుతూ ఉండేవాడు. ఈక్రమంలో శనివారం అర్ధరాత్రి మనస్థాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి మృతుడి భార్య షకీలా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇరువురు పిల్లలు ఉన్నారు.

వృద్ధురాలు ఆత్మహత్య

కడప క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం సరోజినీ నగర్‌కు చెందిన ఓ వృద్ధురాలు ఆదివారం తలకు పూసుకునే రంగు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. సరోజినీనగర్‌కు చెందిన గురజాల చంద్రమ్మ (78) గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈమెకు కొడుకు ఇరువురు ఆడబిడ్డలు ఉన్నారు. అనారోగ్యం బాగుకాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది తలకు పోసుకునే రంగు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించి.. మృతురాల కుమారుడు గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొండలు.. గుట్టల్లో స్థలాలు

- నివాసయోగ్యం కాని చోట స్థలాలు
- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం
- ఇళ్లు కట్టుకున్నా నిరుపయోగమే.. లబ్ధిదారుల ఆవేదన
- ఐదేళ్లలో అడుగు పడని కాలనీలెన్నో

సుండుపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు కాదు ఊళ్లు కడుతామంటూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. నాయకులు కాసులు పోగేసుకునేందుకు నివాసయోగ్యం కాని, దారీ తెన్నూ లేని స్థలాలు, కోర్టు వివాదాల్లోని జాగాలు ఎంపిక చేయడంతో నిర్మాణాలకు అడుగుపడని పరిస్థితి. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఉంటారా లేదా అన్న ఆలోచన లేకుండా వాటి అభివృద్ధికి లక్షలు పోసి ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారు. విలువైన ప్రభుత్వ స్థలాలను వైసీపీ మద్దతుదారులకు, వైసీపీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అర్హులైన నిరుపేదలకు మాత్రం నివాసయోగ్యం కాని స్థలాలను అందజేయడంతో లక్షలు ఖర్చు పెట్టి ఇంటి నిర్మాణం చేసినా నిరుపయోగమేనన్న భావనతో చాలా చోట్ల జగనన్న కాలనీలో ఒక్క ఇంటి నిర్మాణం కూడా ప్రారంభం కాలేదు.

కనీసం దారి కూడా లేదు..


సుండుపల్లె మండల వ్యాప్తంగా 22 జగనన్న కాలనీ లేఅవుట్లను పాలకుల ఆదేశానుసారం ప్లాట్లు ఏర్పాటు చేశారు. దాదాపు రెండు, మూడు లేఅవుట్లు మినహా మిగిలిన అన్ని లేఅవుట్లు గుట్టల్లో, కొండల్లో, చెరువుల సమీపంలో ఏర్పాటు చేశారు. మడితాడు గ్రామ పంచాయతీ జీకే రాచపల్లికు దూరంగా గుట్ట కింద భాగంలో సర్వే నెంబర్ 637లో 23 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించి ఇంటి పట్టాలు కేటాయించారు. రెండు గుట్టల మధ్యలో ఇంటి నిర్మాణానికి ఎటువంటి అవకాశం లేని చోట ప్లాట్లు వేసి పట్టాలు పంపిణీ చేశారు. అక్కడికి వెళ్లేందుకు కనీసం దారి కూడా లేదు. నాలుగు సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటి వరకు కనీసం పునాదులు కూడా వెయ్యలేదు. ఆ స్థలం ఎందుకు పనికిరాదని ఇంటి నిర్మాణానికి అనువైన స్థలం కాదని లబ్ధిదారులు వాపోతున్నారు. మరో చోట కంచిపాటివాండ్లపల్లె సర్వే నెంబరు 2475లో సుండుపల్లె మండల కేంద్రానికి చెందిన మైనార్టీలు, దళితులు ఇతరులు 26 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. అయితే మండల కేంద్రానికి సుమారు నాలుగు కిలోమీటర్లు దూరంగా గుట్టలో పెద్ద పెద్ద బండ రాళ్లు ఉన్న చోట లేఅవుట్ వేసి.. ఆర్భాటంగా ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఎటువంటి వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు ఎవరూ ఇంటి నిర్మాణానికి మొగ్గు చూపలేదు. ఈ విధంగా చాలా లేఅవుట్లలో ఇప్పటి వరకు అడుగు పడలేదంటే అర్హులను వైసీపీ ప్రభుత్వం ఏ విధంగా మోసం చేసిందో తెలుస్తోంది.



గాండ్లపల్లి జగనన్న కాలనీలో కోర్టు వివాదాలతో ఆగిన నిర్మాణాలు

అర్హులకు కోర్టు వివాదాలు అదనం

అర్హులమని గుర్తించి ఇచ్చిందే ఒకటిన్నర సెంటు.. పైగా కోర్టు వివాదాల్లో ఉన్న స్థలాల్లో జగనన్న కాలనీ లేఅవుట్లు వేసి వివాదాలను అదనంగా ఇచ్చారా అని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి సమీపంలో గాండ్లపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ లేఅవుట్‌లో 81 మంది లబ్ధిదారులకు పట్టాలిచ్చారు. ఆ స్థలం కోర్టులో ఉన్నా కూడా పట్టించుకోకుండా పట్టాలు పంపిణీ చేయడంతో అక్కడ నిర్మాణాలు ఆగిపోయాయి. చాలా మంది అర్హులు గుంతలు తీసి పునాదులు నిర్మించారు. స్థానికులు కోర్టుకు వెళ్లడంతో ఆ స్థలం వివాదాస్పదంగా మారి నిర్మాణాలు ఆగిపోయాయి. పైగా పట్టాలిచ్చిన అధికారులు పాలకుల దగ్గరికి వెళితే.. మేమేం చేయాలి వాళ్లు కోర్టుకు వెళ్లారని చేతులెత్తేశారంటూ లబ్ధిదారులు వాపోతున్నారు. ఎల్లారెడ్డిగారిపల్లె సమీపంలో 1387 సర్వే నెంబర్‌లో లేవుట్ వేశారు. ఆ లేఅవుట్‌లో సుమారు 52 మంది అర్హులకు ప్లాట్లు పంపిణీ చేశారు. లేఅవుట్ వేయకముందే అక్కడ పెద్ద పెద్ద మామిడిచెట్లను రైతులు సాగు చేసి ఉన్నారు. పేపర్లపై లేఅవుట్లు తీసి అర్హులకు పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలిచ్చి దాదాపు నాలుగేళ్లు పూర్తయినా ఇప్పటికీ ఇంటి స్థలం చూపించలేదు. ఇంటి స్థలం చూపించాలని ఇప్పటికీ లబ్ధిదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 20 రోజుల క్రితం జరిగిన రెవెన్యూ సదస్సులో కొంత మంది లబ్ధిదారులు ఈ సమస్యను పరిష్కరిస్తే ఇళ్లు నిర్మించుకుంటామంటూ రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.



జీకేరాచపల్లె సమీపంలో గుట్టల మధ్య ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ



పట్టాలిచ్చారు.. స్థలం చూపించలేదని ఇంటి పట్టాలు చూపుతున్న లబ్ధిదారులు (ఫైల్‌ఫొటో)

నెల రోజుల క్రితం ఫిర్యాదు చేశాను



నెల రోజుల క్రితం రెవెన్యూ సదస్సులో పట్టా ఇచ్చారు. ఇంటి స్థలం చూపించలేదని ఫిర్యాదు చేశాను. గత మూడు సంవత్సరాలుగా ఇంటి స్థలం చూపించమని రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నా ఎవ్వ రూ పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వంలో కూడా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇంటి స్థలం చూపించడం లేదు.

-శివయ్య, లబ్ధిదారుడు, సుండుపల్లె

చాలా చోట్ల ప్రారంభించలేదు

చాలా చోట్ల జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు ప్రారంభించలేదు. త్వరగా ఇంటి నిర్మాణం ప్రారంభించి పూర్తి చేయాలని లబ్ధిదారులకు తెలియజేశాము. త్వరగా పూర్తి చేస్తే సకాలంలో బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

-నాగరాజునాయక్, హౌసింగ్ ఏఈ, సుండుపల్లె

శివకేశవులు అబేధ్యం...



వీరగల్లు విగ్రహాలు

వల్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశిగా విరాజిల్లుతున్న పుష్పగిరి క్షేత్రంలో శివకేశవులిద్దరూ అబేధ్యమని చెబుతున్న రెండు వీరగల్లుల విగ్రహాలు ఉన్నాయని రచయిత, చరి త్ర పరిశోధకులు బొమ్మిశెట్టి రమేశ్ పేర్కొన్నారు. ఆయన ఇటీవల పుష్పగిరి క్షేత్రంలో పర్యటించి.. ఇందుకు సంబంధించి వివరాలు తెలిపారు. ఒక వీరగల్లు విగ్రహం పెన్నా(పినాకిని) నది ఎడమ వైపు కొండపై ఉన్న శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణం పక్కగా ఉంది. మరో విగ్రహం పెన్నానదికి కుడివైపు ఉన్న పుష్పగిరి గ్రామంలోని శ్రీవైద్యనాథస్వామి ఆలయంలో ఉంది. రెండు విగ్రహాల్లోని వీరుడు గుర్రంపై ఉన్నారు. ఒకవిగ్రహంలోని వీరుడు ఎడమ వైపు గుర్రాన్ని పట్టుకుని కుడి చేతిలో అద్భుతమైన ఆయుధాన్ని పట్టుకుని ఉన్నారు. ఇంకో విగ్రహంలో వీరుడు ఖడ్గాన్ని ధరించి ఉన్నారు. రెండు విగ్రహాల్లో వీరులు కొప్పులు ధరించి ఉన్నారు. ఈ రెండు విగ్రహాల్లో మధ్యన చతురస్రాకార గదిలో మరణించిన వీరుని తీసుకువెళుతున్న అప్సరసలు అద్భుతంగా కానవస్తున్నారు. శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయ సముదాయ ప్రాంగణంలోని వీరగల్లు పూర్తిగా శైవుల శైలిలో ఉంది. కానీ వైద్యనాథస్వామి ఆలయంలోని వీరగల్లులో అర్ధచంద్రాకృతిలో ఉన్న భాగంలో వీరుడు తలపై కిరీటాన్ని ధరించి వైష్ణవశైలిలో కనబడుతున్నాడు. ఈ విగ్రహంలో చతురస్రాకార గది పార్శ్వభాగాల్లో దీప కలశాలు చెక్కబడి ఉండడం విశేషం. ఇదే విగ్రహం పైభాగంలో అర్ధచంద్రాకృతిభాగంలో రెండు వైపులా పూర్ణ కుంభాలుంటూ అబ్బురపరుస్తోంది. ఈ రెండు విగ్రహాల్లో పైవైపు శివలింగం ఉంది. లింగానికి పక్కగా ఒక విగ్రహంలో కొప్పు ధరించి వీరుడు శివైక్యం పొందారు. ఇంకో విగ్రహంలో వీరుడు కిరీటాన్ని ధరించి వైష్ణవ సాంప్రదాయంలో ఉండి వైకుంఠ ప్రాప్తి పొందారు. పుష్పగిరిలోని ఈ రెండు వీరగల్లుల విగ్రహాలు చాలా దగ్గరి పోలికలను చూపుతున్నాయి. శివకేశవులు ఇద్దరూ ఒకటేనని ఆనాటి శిల్పులు తమ శిల్పకళా నైపుణ్యంతో చెప్పకనే చెబుతున్నారని చరిత్రకారుడు వివరించారు.

అక్షర తపస్వి భూతపురి

- వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి



భూతపురి పురస్కార సత్కారం అందుకుంటున్న పుత్తా పుల్లారెడ్డి

కడప కల్చరల్ ఫిబ్రవరి 16, (ఆంధ్రజ్యోతి) : కవితా రచనను ఒక తపస్సులా భావించి అనేక మహాకావ్యాలను రచించిన అక్షర తపస్వి డాక్టర్ భూతపురి సబ్రహ్మణ్యశర్మ అని యోగివేమన విశ్వ విద్యాలయం వైస్ చానల్సర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సమావేశ మందిరంలో డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు, అల్లసాని పెద్దన సాహిత్య పీఠం సంయుక్త ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ భూతపురి సాహితీకృషి విశిష్టమైనదన్నారు. ఆయన 1953లో కవిగా సాహితీరంగంలో అడుగుపెట్టి 2002 వరకూ అంటే దాదాపు 5 దశాబ్దాలపాటు తనదైన విలక్షణతో సాహితీసేవ చేశారన్నారు. పుత్తా పుల్లారెడ్డి వృత్తిరీత్యా ఇంజనీరైనప్పటికీ విమర్శకుడిగా, వ్యాఖ్యాతగా, అనువాదకుడుగా ప్రసిద్ధుడన్నారు. ఆయనను భూతపురి స్మారక పురస్కారంతో సత్కరించడం అభినందనీయమన్నారు.

అనంతరం సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.విశ్వనాథకుమార్ మాట్లాడుతూ భూతపురి తెలుగులోనే కాకుండా సంస్కృతంలో రచనలు చే శారన్నారు. కార్యక్ర మంలో ఆకాశవాణి పూర్వ సంచాలకులు ఆకుల మల్లేశ్వరరావు, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై అవగాహన అవసరం



ర్యాలీ చేస్తున్న హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ అధికారులు

కడప క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ చీఫ్ డిపో మేనేజరు సతీష్‌కు మార్ అన్నారు. కడప మహావీర్ సర్కిల్ నుంచి హిందు స్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లీన్ అండ్ క్లీన్ ఎనర్జీ ద్వారా చమురు దిగుమతులు తగ్గించడంలో సహాయపడేందుకు, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం పౌరులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. సీనియర్ రీజనల్ మేనేజరు మన్న. దరావు, గంగన్న, ఓబన్న పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్

వేంపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన విజ్ఞాన్ మహోత్సవ్‌లో సాహిత్య కళాపోటీల్లో ఇడుపుల పాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ప్రతిభ చూపారు. క్విజ్‌పోటీల్లో రెండోస్థానం, మాస్టర్ ఓరేటర్‌లో మూడో స్థానం, శాస్త్రీయ, సంగీత పోటీల్లో మూడోస్థానం, లైక్వాండోలో రెండోస్థానం సాధించారని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ప్రతిభ చూపి అవార్డులు పొందిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు జీవన్, శ్రీమన్నార్, అఖిల్, కైసిఫ్, అహ్మద్, రూపశ్రీ, సంతోషిణి, ప్రణతి, లిఖి తాంజలి, విజయభాస్కర్, అఖిల, సిద్దార్థ, కులశేఖర్, కార్తీక్, యజ్ఞ తదితరులను అభినందంచారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న పాలకులు : సీపీఎం

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ విమర్శించారు. ఆదివారం రామకృష్ణ నగర్ సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజానీకాన్ని కదిలించి రానున్న రోజుల్లో ఆందోళనలకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాలకు విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలు కూటమి ప్రభుత్వ నాయకులకు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని విభజన హామీలలో స్పష్టంగా పేర్కొన్నారని.. ఇపుడు విస్మరించడం తగదన్నారు. కార్పొరేట్లకు ఊడిగం చేసే రకంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్ రూపకల్పన చేసి.. సామాన్య, పేద, మధ్యతరగతి వర్గాలను విస్మరించిందన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు కోసం ఉద్యమబాట పడతామని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్

ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించకపోతే ఆందోళన

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమని మెప్మా యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి విజయలక్ష్మి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన జరిగిన మెప్మా ఆర్పీల సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను తక్షణం రద్దు చేయాలన్నారు. మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీకి ప్రభుత్వం కట్టుబడి త్వరితగతిన ఆచరణలోకి తీసుకురావాలన్నారు. ఆర్పీలను ప్రభు త్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆర్పీల ఉద్యోగ భద్రతకు ముప్పు కలిగించే విధంగా సీఓ అధికారుల నుంచి బెదరింపులు రాకుం డా చూడాలన్నారు. ముఖ్యంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, సీఓల నుంచి వస్తున్న ఒత్తిళ్లు, బెదిరింపులను ఆపాలన్నారు. ప్రధానంగా ఆర్పీలను ప్రభుత్వ కార్యకలాపాల్లో మాత్రమే పాల్గొనే విధంగా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పెం డింగ్‌లో వున్న వేతనాలను తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్. విజయలక్ష్మి, నాయకులు వేణుగోపాల్, సుబ్బరాయుడు, చంద్రకళ, క్రాంతి, కళావతి, పద్మావతి, విజయ్‌కుమారి, అరుణ, రమాదేవి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

అడవికి నిప్పు... చెలరేగిన మంటలు

- సన్ననిమ్మ తోటలకు వ్యాప్తి..
- 150 చెట్లు దగ్ధం



అడవికి నిప్పుపెడుతున్న కాలిపోతున్న దృశ్యం



కాలిపోయిన చెట్లను చూపుతున్న రైతు మహబూబ్‌బాషా

చక్రాయపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చక్రాయపేటకు సమీపంలోని అటవీప్రాంతంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తు లు నిప్పు పెట్టడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో అడవికి సమీపంలోని సన్ననిమ్మ తోటలకు ఉన్న కంచెకు అంటుకొని తోటల్లోని దాదాపు 150 చెట్లు దగ్ధమయ్యాయి. షేక్ మహబూబ్ బాష (యమగోల)కు చెందిన 100 చెట్లు, మహబూబ్ పీరా, ఇబ్రహీం అనే రైతులకు చెందిన 40 చీనీచెట్లు, అరకెరా వరి పంటతో పాటు వైర్లు, పైపులు కాలిపోయాయని తెలిపారు. దాదాపు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఈ సమాచారం తెలిసిన సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కాగా, తరుచూ అగ్ని ప్రమాదాలతో అటవీ ప్రాంతాలలో ఉన్న రైతులు భయాందోళన చెందుతున్నారు. గత వారంలో ఇదే ప్రాం తంలో చీనీచెట్లు, పైపులు, వైర్లు కాలిపోయాయి. ఇప్పటికైనా అధికారులు అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని.. ప్రభుత్వం నష్టపోయిన వారికి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

నడివీధి గంగమ్మకు ప్రసాద్‌బాబు పూజలు



నడివీధి గంగమ్మకు పూజలు చేస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని పాత గొల్లపల్లెలో ఆదివారం నిర్వహించిన నడివీధి గంగమ్మ బోనాల కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పాల్గొన్నారు. పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ కౌన్సిలర్ అమర్‌నాథ్, టీడీపీ నేతలు సుగవాసి శ్రీనివాసులు, మన్నేరు రామాంజనేయులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

టీఏసీ సభ్యుడుగా దాడిశెట్టి సిద్దూ



రైల్వేకోడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టెలికం సలహా కమిటీ సభ్యుడుగా దాడిశెట్టి సిద్దూ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం మినిస్ట్రీ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెలిఫోన్ వినియోదగారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు పోయి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాజంపేట, కోడూరు నియోజకవర్గాల్లో సోమవారం నుంచి మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. కోడూరులోని 220కేవీ సబ్ స్టేషన్‌లో బ్రేకర్ మరమ్మతు పనుల కారణంగా రాజంపేట పట్టణం, నందలూరు పట్టణం, కోడూరులలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు

రామాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18న మంగళవారం ఉదయం 10 గంటలకు బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జాషువా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థులు ఒరిజినల్ ఆధార్ కార్డు, కులం, ఆదాయం, రేషన్‌కార్డు, బ్యాంకు పాసుబుక్కు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

రోడ్డు విస్తరణ పూర్తయ్యేదెన్నడు?

● ఒకటిన్నర దశాబ్ద కాలంగా కొనసాగుతున్న పనులు ● ఆందోళనలో ప్రజలు

సిద్దవటం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : విస్తరణ పేరుతో రోడ్డు పక్కనున్న భవనాలను తొలగించి ఏళ్లు గడుస్తున్నా రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదని సిద్దవటం మండల కేంద్రంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2010లో మండల కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణ కోసం పలుమార్లు సర్వే చేశారు. 2015లో అప్పటి ప్రభుత్వం 80 శాతం పరిహారం మంజూరు చేయగా, అధికారులు గృహ యజమానులకు పంపిణీ చేశారు. ఆ తర్వాత పనులు పెండింగ్‌లో పడిపోయాయి. అనంతరం ఐదేళ్ల క్రితం రహదారి అభివృద్ధి పనులకు రూ. 36 లక్షలు మంజూరు కాగా, మూడేళ్ల క్రితం కాంట్రాక్టరు రహదారికి ఇరువైపుల ఉన్న కట్టడాలను 75 శాతం వరకు తొలగించాడు. కొంతవరకు పనులు చేసి ఆ తర్వాత నిలిపివేశాడు.

నిధుల మంజూరులో జాప్యం

ప్రధాన రహదారికి ఇరువైపులా ఇంకా కొన్ని కట్టడాలు తొలగింపునకు నోచుకోలేదు. ఈ ఇళ్ల యజమానులకు పరిహారం మంజూరు చేసేందుకు ఆర్ అండ్ బి అధికారులు రూ. 50 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ నిధుల మంజూరులో జాప్యం నెలకొనడంతో రహదారి విస్తరణ పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారాయని ప్రజలు అనుకుంటున్నారు. ఈ రహదారి పనులు పూర్తి చేస్తే అమరావతి, విజయవాడ, నెల్లూరు ఇతర దూర ప్రాంతాలకు దగ్గరిదారి సిద్ధమవుతుంది. ప్రస్తుత ప్రభుత్వమైని ఈ



విస్తరణకు నోచుకోని సిద్దవటంలోని రహదారి

రహదారి విస్తరణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

పరిహారం రాగానే పనులు చేపడతాం

సిద్దవటం రోడ్డు విస్తరణలో భాగంగా ఆస్తులు నష్టపోతున్న వారికి పరిహారం చెల్లించేందుకు అవసరమైన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం

- గంగిరెడ్డి, ఆర్ అండ్ బీ ఏఈఈ

లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విద్యుత్ లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని తిరుపతి నాయుడు కాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా విద్యుత్‌శాఖ అధికారులు పని చేయాలన్నారు. పట్టణంలో లో ఓల్టేజీ విద్యుత్ సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించి గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్‌శాఖ అధికారులను గట్టి ఆదేశాలు జారీ చేశారు.

పట్టణంలో ఎక్కడా విద్యుత్ సమస్య తలెత్త కుండా ముందు జాగ్రత్త చర్యలు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు.

ప్రజాదర్బార్ అర్జీలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాదర్బార్ కార్యక్రమంలో అందిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి ప్రజాదర్బార్ కార్యక్రమానికి వస్తుంటారని, అధికారులు వారి అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జిల్లాలో భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలు స్వీకరించి వాటిని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తాం

● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

నందలూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తామని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు హామీ ఇచ్చారు. ఆదివారం మండలంలోని కోనాపురం, వెంకటాయపేట గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అంతేగాకుండా మునగ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అతి త్వరలో పరిష్కరిస్తామని మత్స్యకారులకు అన్నిరకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

గుండ్లూరులో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

రాజంపేట టౌన్ : రాజంపేట మండలం గుండ్లూరు గ్రామంలో చమర్తి జగన్‌మోహన్‌రాజు సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలో అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజును గ్రామస్థులు బారీ బాణాసంచ పేల్చుతూ పూలు చల్లుతూ స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రేవూరి వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జి పసుపు లేటి ప్రవీణ్‌కుమార్,



మత్స్యకారుల సమస్యలు వింటున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట మండల పార్టీ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, బాపనయ్యనాయుడు, కోవూరు సుబ్రమణ్యంనాయుడు, నాగేశ్వర నాయుడు ప్రసాద్, గ్రామస్థులు వెంకటేశ్, వెంకటరమణ, పెంచలయ్య, శ్రీను, కొల్లు రెడ్డయ్యనాయుడు, పోలిచెరువు సంఘ ఛైర్మన్ నాగేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

● పంచాయతీరాజ్ రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల
● ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

సిద్దవటం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ఏపీ పంచాయతీరాజ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి కుప్పాల వెంకటసుబ్బయ్య అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని మాధవరం-1 పంచాయతీ పార్వతిపురం గ్రామ సమీపంలోని క్రీడా మైదానంలో ఉమ్మడి కడపజిల్లా జనసేనపార్టీ నేత అధికారి కృష్ణ ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీ నుంచి ఫిబ్రవరి 16వ తేదీ వరకు సీజన్-3 క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో నియోజకవర్గ స్థాయిలో 42 టీములు పాల్గొనగా విన్నర్‌గాగా మంటపంపల్లె జట్టు, రన్నర్‌గా మహబూబ్‌నగర్ మూజో టీమ్ నిలిచాయి. విజేత జట్టుకు ఉమ్మడి కడపజిల్లా జనసేనపార్టీ నాయకుడు అతికారి కృష్ణ 60,116 రూపాయలు, ద్వితీయ బహుమతి ఏపీ పంచాయతిరాజ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి కుప్పాల వెంకటసుబ్బయ్య 40 వేల రూపాయలు, తృతీయ బహుమతి రాజంపేట పార్లమెంట్ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి ఎన్ఆర్ఐ చలపాటి చంద్ర 20 వేల రూపాయలు నగదు, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతుల పంపిణీ కార్యక్రమంలో కుప్పాల

భద్రావతి భావనారాయణ స్వామి వీవర్స్ సొసైటీకి గుర్తింపు

సిద్దవటం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రావతి భావ నారాయణ హ్యాండ్లూం వీవర్స్ సొసైటీని గుర్తిస్తూ ఆదివారం అధికారులు ధ్రువీకరణ పత్రం అందజేశారు. గత ఏడాది డిసెంబరులో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సహకారంతో గత ఏడాది డిసెంబరులో మండలంలోని మాధవరం-1 ఎస్‌కేఆర్ నగర్ గ్రామంలో 56 చేనేత కార్మికులు సొసైటీ ఏర్పాటు చేసుకుని చేనేత జౌళిశాఖ అధికారి ఏడీ పిచ్చేశ్వరరావుకు నవంబరు మాసంలో దరఖాస్తు చేసుకోగా అధికారులు పరిశీలించి శనివారం సాయంత్రం ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ చీఫ్ ప్రమోటర్ జింక శ్రీనివాసులు ఆదివారం మాట్లాడుతూ సొసైటీ ద్వారా స్టాల్ ఏర్పాటు చేసుకోవడానికి వీలు కలుగుతుందని దీని వల్ల కార్మికులకు జీవనోపాధి లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఉక్కడాల శివ, జొన్నాదుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న చేనేత జౌళిశాఖ అధికారి పిచ్చేశ్వరరావు

రైతు భరోసా రూ.60 వేలు ఇవ్వాలి

చిట్వేలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రైతుభరోసా 60 వేలకు పెంచి రెండు దఫాలుగా పెట్టుబడి సాయం అందించాలని రైతు నాయకుడు మలిశెట్టి జతిన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వెంకటరాజుపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎకరాకు 80 వేల నుంచి లక్ష వరక పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని ఒక యేడాది పంట నష్టం జరిగితే పెట్టుబడి కూడా చేతికి రాక రైతులు తీవ్ర నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై వచ్చే అసెంబ్లి సమావేశాల్లో బిల్లు పెట్టాలని కోరారు. వెంకట నారాయణ, నరసారెడ్డి, చెంగయ్య, సుబ్రమణ్యం, బాబు, వెంకటసుబ్బయ్య, మణి, రమణ పాల్గొన్నారు.

గురుకులంలో వసతుల మెరుగుకు చర్యలు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సంజీవపురం గురుకుల పాఠశాలలో వసతుల మెరుగుకు కృషి చేస్తామని ప్రిన్సిపాల్ మన్సూర్ అలీ తెలిపారు. ఆదివారం పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాఠశాలలోని సమస్యలపై చర్చించారు. పారిశుధ్యం పరిరక్షించడంతోపాటు, మరుగుదొడ్లకు సత్వరమే మరమ్మతులు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో తమ్మప్ప, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి

నందలూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఎంఈవోలు-1, 2 నాగయ్య, అనంతకృష్ణ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు షేక్ రౌఫ్‌బాషాలు కోరారు. నందలూరు జడ్పీ హైస్కూలులో శనివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై శ్రద్ధ చూపాలని, తరగతి గదిలో విడి విడిగా బోధన అభ్యసన సామగ్రి వినియోగించాలని అన్నారు. టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.

బియ్యం అమ్ముకున్న వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బియ్యం అమ్ముకున్న బీసీ బాలుర వసతి గృహ వార్డెన్ శ్రీనివాసులతో పాటు, సిబ్బంది ఖాదర్‌బాషా, వెంకటేశ్‌లను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తుమ్మల లవకుమార్ బియ్యాన్ని పట్టుకుని స్థానిక తహసీల్దార్‌తో పాటు పాటు జిల్లా బీసీ సంక్షేమ అధికారి సురేశ్‌కు సమాచారం అందించినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానం వ్యక్తం చేశారు. తహసీల్దార్ భాగ్యలత, జిల్లా బీసీ అధికారి సురేశ్ విచారణ పేరుతో సబ్జెక్టు డైవర్ట్ చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. జిల్లా బీసీ అధికారి సురేశ్ వ్యవహరిస్తున్న తీరు ముడుపులు ముట్టాయేమో అన్న అనుమానాలకు తావిస్తోందన్నారు. రెండు రోజుల క్రితం బియ్యం పట్టుబడినా, ఇంతవరకు ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదో అధికారులు చెప్పాలన్నారు.ఈ విషయంపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గంగమ్మ జాతరకు అన్ని సౌకర్యాలు కల్పించాలి



గంగమ్మజాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న మండిపల్లె లక్ష్మీప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):గంగమ్మజాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లె లక్ష్మీప్రసాదురెడ్డి ఆలయ కార్య నిర్వహణ అధికారులకు సూచించారు. ఆదివారం అనంతపురం గంగమ్మ ఆలయాన్ని సందర్శించిన ఆయన జాతర ఏర్పాట్లు పరిశీలించారు. మహిళలకు ప్రత్యేక స్నానవాటికలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర జరగబోవు మూడు రోజులు విద్యుత్ ప్రసారంలో అంతరాయం కలగకుండా, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. చిట్లూరు క్రాస్, లక్కిరెడిపల్లె క్రాస్, మర్రిచెట్టు ప్రాంతాల్లో ఆర్‌సీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మండల టిడిపి ఇన్చార్జీ యనమల మదన్‌మోహన్ ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ రామాంజనేయులు, ఆలయ అర్చకులు చెల్లు గంగరాజు, జగదీశ్, రామచంద్ర, రెడ్డిశేఖర్, టీడీపీ నాయకులు చెన్నకృష్ణారెడ్డి, గురుస్వామి వెంకటేశ్వరులు, చలపతి, వేణు, రామచంద్ర, జనార్దన, కావలి ఆంజనేయులు, మహదేవ, రమణ పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేరాయలుకు నివాళి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయులు గొప్ప పరిపాలనాదక్షుడని రైల్వేకోడూరు కాపు నాయకులు సీహెచ్ రమేశ్ బాబు, మండల నాగేంద్ర, నందా బాల తెలిపారు. శ్రీకృష్ణదేవరాయులు 534వ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారత మధ్య యుగ రాజుల్లో మహాకీర్తిశాలిగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, దామర్ల సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయలుకు నివాళి అర్పిస్తున్న కాపు నాయకులు

కనిపించని బర్డ్‌ఫ్లూ ప్రభావం

● రైల్వేకోడూరులో పెరిగిన చికెన్ ధర




మాంసం దుకాణాల వద్ద బారులుతీరిన జనం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి): బర్డ్ ఫ్లూ నేపథ్యంలో ఉభయ రాష్ట్రాలో పౌల్ట్రీ రంగం కుదేలవుతుండగా, రైల్వేకోడూరులో మాత్రం చికెన్ ధర పెరిగింది. గతంలో రూ. 150 ఉన్న కిలో చికెన్ ఆదివారం రూ. 220లు, మటన్ కిలో రూ. 900, చేపలు రకాన్ని బట్టి కిలో రూ. 200లు నుంచి రూ. 500ల వరకు అమ్ముడయ్యాయి. మాంసం, చేపలకు డిమాండ్ పెరిగింది. రాష్ట్రంలో ఎక్కడో బర్డ్‌ఫ్లూ ఉన్నా, చిత్తూరు తదితర ప్రాంతాల్లో విస్తరించలేదని దుకాణదారులు మాయమాటలు చెపుతున్నట్లు సమాచారం

సీ, డీ గ్రేడ్ ముగ్గురాయి ఇవ్వాలి

● పల్వరైజింగ్ మిల్లు యజమానుల డిమాండ్




సమావేశానికి హాజరైన పల్వరైజింగ్ మిల్లుల యజమానులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ముగ్గురాయి పల్వరైజింగ్ మిలులకు సీ, డీ గ్రేడు ముగ్గురాయిని ఇవ్వాలని మిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు మాచినేని విశ్వేశ్వరనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో మంగంపేట పల్వరైజింగ్ మిల్లుల యజమానుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేట సీ, డీ గ్రేడు ముగ్గురాయి టన్ను రూ. 1680 ఉండగా ఇటీవల 60 లక్షల టన్నులకు ఏపీఎండీసీ బల్క్ టెండర్ నిర్వహించిందన్నారు. సీ, డీ గ్రేడ్ ముగ్గురాయి టన్ను రూ. 1198కి ధర ఖరారు చేసిందన్నారు. ప్రస్తుతం ఈ రాయిని ఒక ఎక్స్‌పోర్టు కంపెనీకి ఇచ్చిందన్నారు. మంగంపేటలోని మిల్లులకు అదే ధర ప్రకారం ఇస్తే మిల్లుల యజమానులు కొంత ఊరట పొందుతారని తెలిపారు. ఈ విషయంపై మంగళవారం విజయవాడలోని ఏపీ ఎండీసీ ప్రధాన కార్యాలయంలో ఎండీని కలసి వినతిపత్రం ఇస్తామని తెలిపారు. ఏపీ ఎండీసీ చిన్న తరహా పల్వరైజింగ్ మిల్లులను ఆదుకోవాలన్నారు.

ఆరుగురికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిదిలోని చెన్నముక్కపల్లె లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం ఆరుగురికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మందికి పరీక్షలు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 20 మందికి మందులు, అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి ఛైర్మన్ వైవీ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఆపరేషన్లకు ఎంపిక చేస్తున్న వైద్యులు

గడ్డివాములు, బైకులు దగ్ధం


వేంపల్లెలో దగ్ధమవుతున్న గడ్డివాములు

వేంపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం పులివెందుల-రాయచోటి రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో రెండు గడ్డివాములు, బైకులు దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లింది. షేక్ దూద్‌పీర్ గడ్డివ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తుంటారు. ఆదివారం ఉదయం ఎవరో నిప్పుపెట్టడంతో మంటలు ఎగిసపడ్డాయి. చుట్టుపక్కల వారు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా... రెండు గడ్డివాములు పక్కనే పార్క్ చేసి ఉంచిన బైకులు కాలిపోయాయి. అగ్నిప్రమాదంతో తీరని నష్టం జరి గిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు దూద్‌పీర్ కోరుతున్నాడు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కడప క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సరోజినీ నగర్‌లో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. సరోజినీనగర్‌లో నివాసం ఉంటున్న షేక్ షబ్బీర్ (35) టైల్స్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని సంవత్సరాలుగా మద్యంకు అలవాటుపడి పనికిపోయి వచ్చిన డబ్బులు ఇంట్లో ఇవ్వకుండా తాగుతూ ఉండేవాడు. ఈక్రమంలో శనివారం అర్ధరాత్రి మనస్థాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి మృతుడి భార్య షకీలా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇరువురు పిల్లలు ఉన్నారు.

వృద్ధురాలు ఆత్మహత్య

కడప క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం సరోజినీ నగర్‌కు చెందిన ఓ వృద్ధురాలు ఆదివారం తలకు పూసుకునే రంగు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. సరోజినీనగర్‌కు చెందిన గురజాల చంద్రమ్మ (78) గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈమెకు కొడుకు ఇరువురు ఆడబిడ్డలు ఉన్నారు. అనారోగ్యం బాగుకాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది తలకు పోసుకునే రంగు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించి.. మృతురాల కుమారుడు గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొండలు.. గుట్టల్లో స్థలాలు

- నివాసయోగ్యం కాని చోట స్థలాలు
- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం
- ఇళ్లు కట్టుకున్నా నిరుపయోగమే.. లబ్ధిదారుల ఆవేదన
- ఐదేళ్లలో అడుగు పడని కాలనీలెన్నో

సుండుపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు కాదు ఊళ్లు కడుతామంటూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. నాయకులు కాసులు పోగేసుకునేందుకు నివాసయోగ్యం కాని, దారీ తెన్ను లేని స్థలాలు, కోర్టు వివాదాల్లోని జాగాలు ఎంపిక చేయడంతో నిర్మాణాలకు అడుగుపడని పరిస్థితి. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఉంటారా లేదా అన్న ఆలోచన లేకుండా వాటి అభివృద్ధికి లక్షలు పోసి ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారు. విలువైన ప్రభుత్వ స్థలాలను వైసీపీ మద్దతుదారులకు, వైసీపీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అర్హులైన నిరుపేదలకు మాత్రం నివాసయోగ్యం కాని స్థలాలను అందజేయడంతో లక్షలు ఖర్చు పెట్టి ఇంటి నిర్మాణం చేసినా నిరుపయోగమేనన్న భావనతో చాలా చోట్ల జగనన్న కాలనీలో ఒక్క ఇంటి నిర్మాణం కూడా ప్రారంభం కాలేదు.


కనీసం దారి కూడా లేదు..

సుండుపల్లె మండల వ్యాప్తంగా 22 జగనన్న కాలనీ లేఅవుట్లను పాలకుల ఆదేశానుసారం ప్లాట్లు ఏర్పాటు చేశారు. దాదాపు రెండు, మూడు లేఅవుట్లు మినహా మిగిలిన అన్ని లేఅవుట్లు గుట్టల్లో, కొండల్లో, చెరువుల సమీపంలో ఏర్పాటు చేశారు. మడితాడు గ్రామ పంచాయతీ జీకే రాచపల్లికు దూరంగా గుట్ట కింద భాగంలో సర్వే నెంబర్ 637లో 23 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించి ఇంటి పట్టాలు కేటాయించారు. రెండు గుట్టల మధ్యలో ఇంటి నిర్మాణానికి ఎటువంటి అవకాశం లేని చోట ప్లాట్లు వేసి పట్టాలు పంపిణీ చేశారు. అక్కడికి వెళ్లేందుకు కనీసం దారి కూడా లేదు. నాలుగు సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటి వరకు కనీసం పునాదులు కూడా వెయ్యలేదు. ఆ స్థలం ఎందుకు పనికిరాదని ఇంటి నిర్మాణానికి అనువైన స్థలం కాదని లబ్ధిదారులు వాపోతున్నారు. మరో చోట కంచిపాటివాండ్లపల్లె సర్వే నెంబరు 2475లో సుండుపల్లె మండల కేంద్రానికి చెందిన మైనార్టీలు, దళితులు ఇతరులు 26 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపణీ చేశారు. అయితే మండల కేంద్రానికి సుమారు నాలుగు కిలోమీటర్లు దూరంగా గుట్టలో పెద్ద పెద్ద బండ రాళ్లు ఉన్న చోట లేఅవుట్ వేసి.. ఆర్భాటంగా ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఎటువంటి వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు ఎవరూ ఇంటి నిర్మాణానికి మొగ్గు చూపలేదు. ఈ విధంగా చాలా లేఅవుట్లలో ఇప్పటి వరకు అడుగు పడలేదంటే అర్హులను వైసీపీ ప్రభుత్వం ఏ విధంగా మోసం చేసిందో తెలుస్తోంది.


గాండ్లపల్లి జగనన్న కాలనీలో కోర్టు వివాదాలతో ఆగిన నిర్మాణాలు

అర్హులకు కోర్టు వివాదాలు అదనం

అర్హులమని గుర్తించి ఇచ్చిందే ఒకటిన్నర సెంటు.. పైగా కోర్టు వివాదాల్లో ఉన్న స్థలాల్లో జగనన్న కాలనీ లేఅవుట్లు వేసి వివాదాలను అదనంగా ఇచ్చారా అని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి సమీపంలో గాండ్లపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ లేఅవుట్‌లో 81 మంది లబ్ధిదారులకు పట్టాలిచ్చారు. ఆ స్థలం కోర్టులో ఉన్నా కూడా పట్టించుకోకుండా పట్టాలు పంపిణీ చేయడంతో అక్కడ నిర్మాణాలు ఆగిపోయాయి. చాలా మంది అర్హులు గుంతలు తీసి పునాదులు నిర్మించారు. స్థానికులు కోర్టుకు వెళ్లడంతో ఆ స్థలం వివాదాస్పదంగా మారి నిర్మాణాలు ఆగిపోయాయి. పైగా పట్టాలిచ్చిన అధికారులు పాలకుల దగ్గరికి వెళితే.. మేమేం చేయాలి వాళ్లు కోర్టుకు వెళ్లారని చేతులెత్తేశారంటూ లబ్ధిదారులు వాపోతున్నారు. ఎల్లారెడ్డిగారిపల్లె సమీపంలో 1387 సర్వే నెంబర్‌లో లేవుట్ వేశారు. ఆ లేఅవుట్‌లో సుమారు 52 మంది అర్హులకు ప్లాట్లు పంపిణీ చేశారు. లేఅవుట్ వేయకముందే అక్కడ పెద్ద పెద్ద మామిడిచెట్లను రైతులు సాగు చేసి ఉన్నారు. పేపర్లపై లేఅవుట్లు తీసి అర్హులకు పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలిచ్చి దాదాపు నాలుగేళ్లు పూర్తయినా ఇప్పటికీ ఇంటి స్థలం చూపించలేదు. ఇంటి స్థలం చూపించాలని ఇప్పటికీ లబ్దిదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 20 రోజుల క్రితం జరిగిన రెవెన్యూ సదస్సులో కొంత మంది లబ్ధిదారులు ఈ సమస్యను పరిష్కరిస్తే ఇళ్లు నిర్మించుకుంటామంటూ రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.


జీకేరాచపల్లె సమీపంలో గుట్టల మధ్య ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ


పట్టాలిచ్చారు.. స్థలం చూపించలేదని ఇంటి పట్టాలు చూపుతున్న లబ్ధిదారులు (ఫైల్‌ఫొటో)

నెల రోజుల క్రితం ఫిర్యాదు చేశాను



నెల రోజుల క్రితం రెవెన్యూ సదస్సులో పట్టా ఇచ్చారు. ఇంటి స్థలం చూపించలేదని ఫిర్యాదు చేశాను. గత మూడు సంవత్సరాలుగా ఇంటి స్థలం చూపించమని రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నా ఎవ్వ రూ పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వంలో కూడా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇంటి స్థలం చూపించడం లేదు.

-శివయ్య, లబ్ధిదారుడు, సుండుపల్లె


చాలా చోట్ల ప్రారంభించలేదు

చాలా చోట్ల జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు ప్రారంభించలేదు. త్వరగా ఇంటి నిర్మాణం ప్రారంభించి పూర్తి చేయాలని లబ్ధిదారులకు తెలియజేశాము. త్వరగా పూర్తి చేస్తే సకాలంలో బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

-నాగరాజునాయక్, హౌసింగ్ ఏఈ, సుండుపల్లె

అక్షర తపస్వి భూతపురి

- వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి



భూతపురి పురస్కార సత్కారం అందుకుంటున్న పుత్తా పుల్లారెడ్డి

కడప కల్చరల్ ఫిబ్రవరి 16, (ఆంధ్రజ్యోతి) : కవితా రచనను ఒక తపస్సులా భావించి అనేక మహాకావ్యాలను రచించిన అక్షర తపస్వి డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ అని యోగివేమన విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సమావేశ మందిరంలో డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు, అల్లసాని పెద్దన సాహిత్య పీఠం సంయుక్త ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ భూతపురి సాహితీకృషి విశిష్టమైనదన్నారు. ఆయన 1953లో కవిగా సాహితీరంగంలో అడుగుపెట్టి 2002 వరకూ అంటే దాదాపు 5 దశాబ్దాలపాటు తనదైన విలక్షణతో సాహితీసేవ చేశారన్నారు. పుత్తా పుల్లారెడ్డి వృత్తిరీత్యా ఇంజనీరైనప్పటికీ విమర్శకుడిగా, వ్యాఖ్యాతగా, అనువాదకుడుగా ప్రసిద్ధుడన్నారు. ఆయనను భూతపురి స్మారక పురస్కారంతో సత్కరించడం అభినందనీయమన్నారు.
అనంతరం సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.విశ్వనాథకుమార్ మాట్లాడుతూ భూతపురి తెలుగులోనే కాకుండా సంస్కృతంలో రచనలు చే శారన్నారు. కార్యక్ర మంలో ఆకాశవాణి పూర్వ సంచాలకులు ఆకుల మల్లేశ్వరరావు, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై అవగాహన అవసరం


ర్యాలీ చేస్తున్న హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ అధికారులు

కడప క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ చీఫ్ డిపో మేనేజరు సతీష్‌కు మార్ అన్నారు. కడప మహావీర్ సర్కిల్ నుంచి హిందు స్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లీన్ అండ్ క్లీన్ ఎనర్జీ ద్వారా చమురు దిగుమతులు తగ్గించడంలో సహాయపడేందుకు, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం పౌరులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. సీనియర్ రీజనల్ మేనేజరు మన్మ. దరావు, గంగన్న, ఓబన్న పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్

వేంపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన విజ్ఞాన్ మహోత్సవ్‌లో సాహిత్య కళాపోటీల్లో ఇడుపుల పాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ప్రతిభ చూపారు. క్విజ్‌పోటీల్లో రెండోస్థానం, మాస్టర్ ఓరేటర్‌లో మూడో స్థానం, శాస్త్రీయ, సంగీత పోటీల్లో మూడోస్థానం, తైక్వాండోలో రెండోస్థానం సాధించారని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ప్రతిభ చూపి అవార్డులు పొందిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు జీవన్, శ్రీమన్నార్, అఖిల్, కైసిఫ్, అహ్మద్, రూపశ్రీ, సంతోషిణి, ప్రణతి, లిఖి తాంజలి, విజయభాస్కర్, అఖిల, సిద్దార్థ, కులశేఖర్, కార్తీక్, యజ్ఞ తదితరులను అభినందంచారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న పాలకులు : సీపీఎం

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ విమర్శించారు. ఆదివారం రామకృష్ణ నగర్ సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజానీకాన్ని కదిలించి రానున్న రోజుల్లో ఆందోళనలకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాలకు విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలు కూటమి ప్రభుత్వ నాయకులకు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని విభజన హామీలలో స్పష్టంగా పేర్కొన్నారని.. ఇపుడు విస్మరించడం తగదన్నారు. కార్పొరేట్లకు ఊడిగం చేసే రకంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్ రూపకల్పన చేసి.. సామాన్య, పేద, మధ్యతరగతి వర్గాలను విస్మరించిందన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు కోసం ఉద్యమబాట పడతామని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్

శివకేశవులు అబేధ్యం...


వీరగల్లు విగ్రహాలు

వల్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశిగా విరాజిల్లుతున్న పుష్పగిరి క్షేత్రంలో శివకేశవులిద్దరూ అబేధ్యమని చెబుతున్న రెండు వీరగల్లుల విగ్రహాలు ఉన్నాయని రచయిత, చరి త్రపరిశోధకులు బొమ్మిశెట్టి రమేశ్ పేర్కొన్నారు. ఆయన ఇటీవల పుష్పగిరి క్షేత్రంలో పర్యటించి.. ఇందుకు సంబంధించి వివరాలు తెలిపారు. ఒక వీరగల్లు విగ్రహం పెన్నా(పినాకిని) నది ఎడమ వైపు కొండపై ఉన్న శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణం పక్కగా ఉంది. మరో విగ్రహం పెన్నానదికి కుడివైపు ఉన్న పుష్పగిరి గ్రామంలోని శ్రీవైద్యనాథస్వామి ఆలయంలో ఉంది. రెండు విగ్రహాల్లోని వీరుడు గుర్రంపై ఉన్నారు. ఒకవిగ్రహంలోని వీరుడు ఎడమ వైపు గుర్రాన్ని పట్టుకుని కుడి చేతిలో అద్భుతమైన ఆయుధాన్ని పట్టుకుని ఉన్నారు. ఇంకో విగ్రహంలో వీరుడు ఖడ్గాన్ని ధరించి ఉన్నారు. రెండు విగ్రహాల్లో వీరులు కొప్పులు ధరించి ఉన్నారు. ఈ రెండు విగ్రహాల్లో మధ్యన చతురస్రాకార గదిలో మరణించిన వీరుని తీసుకువెళుతున్న అప్సరసలు అద్భుతంగా కానవస్తున్నారు. శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ సముదాయ ప్రాంగణంలోని వీరగల్లు పూర్తిగా శైవుల శైలిలో ఉంది. కానీ వైద్యనాథస్వామి ఆలయంలోని వీరగల్లులో అర్ధచంద్రాకృతిలో ఉన్న భాగంలో వీరుడు తలపై కిరీటాన్ని ధరించి వైష్ణవశైలిలో కనబడుతున్నాడు. ఈ విగ్రహంలో చతురస్రాకార గది పార్శ్వభాగాల్లో దీప కలశాలు చెక్కబడి ఉండడం విశేషం. ఇదే విగ్రహం పైభాగంలో అర్ధచంద్రాకృతిభాగంలో రెండు వైపులా పూర్ణకుంభాలుంటూ అబ్బురపరుస్తోంది. ఈ రెండు విగ్రహాల్లో పైవైపు శివలింగం ఉంది. లింగానికి పక్కగా ఒక విగ్రహంలో కొప్పు ధరించి వీరుడు శివైక్యం పొందారు. ఇంకో విగ్రహంలో వీరుడు కిరీటాన్ని ధరించి వైష్ణవ సాంప్రదాయంలో ఉండి వైకుంఠ ప్రాప్తి పొందారు. పుష్పగిరిలోని ఈ రెండు వీరగల్లుల విగ్రహాలు చాలా దగ్గరి పోలికలను చూపుతున్నాయి. శివకేశవులు ఇద్దరూ ఒకటేనని ఆనాటి శిల్పులు తమ శిల్పకళా నైపుణ్యంతో చెప్పకనే చెబుతున్నారని చరిత్రకారుడు వివరించారు.

ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించకపోతే ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమని మెప్మా యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి విజయలక్ష్మి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన జరిగిన మెప్మా ఆర్పీల సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను తక్షణం రద్దు చేయాలన్నారు. మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీకి ప్రభుత్వం కట్టుబడి త్వరితగతిన ఆచరణలోకి తీసుకురావాలన్నారు. ఆర్పీలను ప్రభు త్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆర్పీల ఉద్యోగ భద్రతకు ముప్పు కలిగించే విధంగా సీఓ అధికారుల నుంచి బెదరింపులు రాకుం డా చూడాలన్నారు. ముఖ్యంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, సీఓల నుంచి వస్తున్న ఒత్తిళ్లు, బెదిరింపులను ఆపాలన్నారు. ప్రధానంగా ఆర్పీలను ప్రభుత్వ కార్యకలాపాల్లో మాత్రమే పాల్గొనే విధంగా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పెం డింగ్‌లో వున్న వేతనాలను తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్. విజయలక్ష్మి, నాయకులు వేణుగోపాల్, సుబ్బరాయుడు, చంద్రకళ, క్రాంతి, కళావతి, పద్మావతి, విజయ్‌కుమారి, అరుణ, రమాదేవి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


టీఏసీ సభ్యుడుగా దాడిశెట్టి సిద్దూ



రైల్వేకోడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టెలికం సలహా కమిటీ సభ్యుడుగా దాడిశెట్టి సిద్దూ నియమి తులయ్యారు. ఈ మేరకు ఆదివారం మినిస్ట్రీ ఆఫ్ టెలీ కమ్యూనికే షన్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ టెలిఫోన్ వినియోదగారులు ఎదు ర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు పోయి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

అడవికి నిప్పు... చెలరేగిన మంటలు

- సన్ననిమ్మ తోటలకు వ్యాప్తి.. ● 150 చెట్లు దగ్ధం


అడవికి నిప్పుపెడుతున్న కాలిపోతున్న దృశ్యం


కాలిపోయిన చెట్లను చూపుతున్న రైతు మహబూబ్‌బాష

చక్రాయపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చక్రాయపేటకు సమీపంలోని అటవీప్రాంతంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తు లు నిప్పు పెట్టడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో అడవికి సమీపంలోని సన్ననిమ్మ తోటలకు ఉన్న కంచెకు అంటుకొని తోటల్లోని దాదాపు 150 చెట్లు దగ్ధమయ్యాయి. షేక్ మహబూబ్ బాష (యమగోల)కు చెందిన 100 చెట్లు, మహబూబ్ పీరా, ఇబ్రహీం అనే రైతులకు చెందిన 40 చీనీచెట్లు, అరకెరా వరి పంటతో పాటు వైర్లు, పైపులు కాలిపోయాయని తెలిపారు. దాదాపు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఈ సమాచారం తెలిసిన సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కాగా, తరుచూ అగ్ని ప్రమాదాలతో అటవీ ప్రాంతాలలో ఉన్న రైతులు భయాందోళన చెందుతున్నారు. గత వారంలో ఇదే ప్రాం తంలో చీనీచెట్లు, పైపులు, వైర్లు కాలిపోయాయి. ఇప్పటికైనా అధికారులు అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని.. ప్రభుత్వం నష్టపోయిన వారికి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఒక్కటైన 23 ఏళ్ల అపూర్వ బంధం

'స్నేహమేరా జీవితం.... స్నేహమేర శాశ్వతం...' అంటూ...
కుటుంబ సభ్యులతో సరదాగా గడిపిన పూర్వ విద్యార్థులు


ఉపాధ్యాయులతో చెంబకూరు జడ్పీహైస్కూల్ పూర్వ విద్యార్థులు

కురబలకోట, ఫిబ్రవరి 16: వారంతా ఒకే పాఠశాలలో చదివారు. వృత్తి పరంగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. క్షణం తీరిక లేకుండా బిజీబిజీగా గడుపుతున్న తరుణంలో తాము కలవాలని కొందరు విద్యార్థులు సంకల్పించారు. అందుబాటులో ఉన్న వారిద్వారా అందరి వివరాలు సేకరించారు. సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన స్నేహితుల కోసం దాదాపు 3నెలల దాకా తీవ్రంగా శ్రమించారు. దీంతో 23 ఏళ్ల తర్వాత పూర్వవిద్యార్థులు ఒకే చోట కలిశారు. ఇలాంటి అపూర్వ కలయికకు కురబలకోట జడ్పీహైస్కూల్ వేదికైంది. కురబలకోట జడ్పీ హైస్కూల్‌లో 1997-2002లో టెన్త్ చదివిన వారంతా తాము చదువుకున్న పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలసి చిన్నపిల్లల్లాగా సందడి చేశారు. తాము చదువుకున్న రోజుల్లో గడిపిన అనుభూతులను గుర్తుచేసుకుంటూ స్నేహితులతో కలిసి పంచుకుని సరదాగా గడపడం, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులు సుధా, రాజేశ్వరి, నాగరాజు. యహసానుల్లా, ఇస్మాయిల్, వినోద్, శ్రీనివాసులను సన్మానించారు. అందరూ కలసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం సాయంత్రం కేక్ కట్ చేసి సంబరాలను ముగించారు. పాఠశాల అభివృద్ధికి సహాయసహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మహబూబ్ బాషా, నాగరాజ, లక్ష్మీకాంత్, రాజీవ్, రియాజ్, షబానా, కవిత, హసీనా తదితరులు పాల్గొన్నారు.

చెంబకూరులో....

రామసముద్రం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చెంబకూరు జడ్పీ హైస్కూల్ 2004-05లో టెన్త్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పాఠశాలలో కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ గడిచిన 20ఏళ్లనాటి ఉపాధ్యాయులను గుర్తుపెట్టుకుని సన్మానించడం అప్పటి సంస్కారానికి నిదర్శనమని పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉపాధ్యాయులు విద్యార్థులను ఆశీర్వదించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకరప్ప, మ్యాథమేటిక్స్, సోషల్ టీచర్ జయచంద్రారెడ్డి, తెలుగు టీచర్ చంద్రశేఖర్ నాయుడు, ఇంగ్లీష్ టీచర్ బాలసుబ్రహ్మణ్యం, హిందీ టీచర్ అనంత శేష గోపాలాచారి, మాధవి, హరనాథ్, హంసవేణి పాల్గొన్నారు.

అమ్మా.. గంగమ్మ తల్లీ..


ముత్యాల అలంకరణలో నలవీరగంగా భవానీ

- సీటీఎం జాతర ముగింపు
- ఆలయంలో కిక్కిరిసిన భక్తులు


భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ఆవరణం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సీటీఎంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న జాతర ఆదివారం ఘనంగా ముగిసింది. ఆదివారం దోపు తిరునాళ్లతో జాతర ముగిసింది. ఆలయానికి ఆదివారం ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. భక్తుల రద్దీ అధికం కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు గంటల సమయం క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. ఎండను తట్టుకుని క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. సీటీఎం చుట్టపక్కల గ్రామాల నుంచి ఆదివారం కూడా టెకాయ పట్ల బండ్లు, దీలు, బోనాలు సమర్పించారు. రెండు రోజులు శుక్ర, శనివారాలు కావడంతో ఆదివారం అమ్మవారికి ఎక్కువగా జంతుబలులు సమర్పించారు. దీంతో ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. వందల సంఖ్యలో భక్తులు ఒక్కసారిగా రావడంతో ఆలయ ఆవరణం భక్తులతో నిండిపోయింది. సాయంత్రం గంగమ్మకు దోపు తిరునాళ్లను నిర్వహించారు. దీంతో సీటీఎం జాతర ముగిసింది. ఆలయంలో భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి తీర్థప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు పంపిణీ చేశారు.

సీటీఎంలో ఎద్దుల పరుష

మదనపల్లె మండలంలోని సీటీఎం గ్రామంలో ఆదివారం నుంచి గొప్పగా ఎద్దుల పరుషను ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పశువులకు తాగు నీరు, నీడ, మేత అందించారు. ఈ పరుషకు సీటీఎం చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి పరుషకు పశువులు తరలివచ్చాయి. ఇందులో ముఖ్యంగా దేశీ, అల్లికారి, నాటీ వివిధ రకాల పశువులు వచ్చాయి. రూ.30 వేల నుంచి రూ.1.70 లక్షల వరకు ధరలు పలికాయి. సీటీఎం సమీపంలోని పెద్దపల్లెకు చెందిన బయ్యారెడ్డి అనే రైతు ఎద్దులు కాడె రూ.1.70 వేలు పరుషలో అధిక ధరలు పలికాయి. ఏడాదితో పోలిస్తే పరుషకు పశువులు తక్కువగానే వచ్చాయి.


సీటీఎం పరుషకు తరలి వచ్చిన పశువులు

శ్రీకృష్ణదేవరాయలు గొప్ప పరిపాలనా దక్షుడు

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు ● తిరుపతిలో మునిగోపాల కృష్ణకు జాతీయ అవార్డు ప్రదానం



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్థానిక నేతలు - మునిగోపాలకృష్ణకు తిరుపతిలో శ్రీకృష్ణదేవరాయ పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయలు పరిపాలనా దక్షుడని, చెరువుల్లో పుష్కలంగా నీరు ఉంటే రైతుల ఇండ్లలో సిరిసంపదలకు కొదవే ఉండదని భావించి 500 చెరువులను తవ్వించారని కొనియాడారు. ఆదివారం 544 వ జయంతి వేడుకలను బసినికొండ బైపాస్ బైజంక్షన్‌లో నిర్వహించారు. మదనపల్లె రాయల్ యూత్ సొసైటీ అధ్యక్షుడు రేగడి ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చెరువులను తవ్వించి పేదల దాహాన్నితీర్చి, రైతులకు పంటనీటిని అందించి భారతదేశ ప్రజల ఆకలి చావుల నుంచి రక్షించిన మహా చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. ఎన్నికల సమయంలో ఏపీ సీఎం నారాచంద్రబాబు నాయుడు బలిజలకు ఇచ్చిన మాట ప్రకారం మదనపల్లెలో కాపు భవన్ మంజూరు చేయాలని, ఆర్థికంగా వెనుకబడిన వారి పిల్లల చదువుల కోసం స్కాలర్ షిప్స్ అందివ్వాలని కోరారు. రాష్ట్ర కాపు, బలిజ, తెలగ ఒంటరి అధ్యక్షుడు రేగడి ప్రసాద్‌కుమార్, సుంకర రామచంద్ర, పసుపులేటి వరప్రసాద్, రెడ్డి శ్రీనివాసులు, డాకరాజు, రమేష్, తదితరలు పాల్గొన్నారు.

మునిగోపాల కృష్ణకు జాతీయ అవార్డు

వయోవృద్ధులకు చేసిన సేవలను గుర్తించి మదనపల్లెకు చెందిన ఏపీ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు మునిగోపాల్‌కృష్ణకు జాతీయ అవార్డును అందించారు. ఆదివారం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన శ్రీకృష్ణరాయుల జయంతిని పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయలు అవార్డు అందించారు. అనంతరం మునిగోపల్‌కృష్ణ, భార్య ధనలక్ష్మిని దుశ్శాలువాతో సత్కరించి శ్రీకృష్ణదేవారాయల కాస్య విగ్రహం అందజేశారు. ప్రొఫెసర్ శ్రీనివాసులు, డాక్టర్ గొల్లపూడి తిరుపతి రావు, డాక్టర్ మునిరత్నమయ్య, డాక్టర్ చంద్రశేఖర్, కార్యదర్శి కరుణాకర్, ట్రెజరర్ ఉస్మాన్ సాహెబ్, ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్, శకుంతలమ్మ, కృష్ణమూర్తి, నాగరాజ, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దతిప్పసముద్రంలో...

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలను స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పీటీఎంలోని బస్టాండు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే అతి పెద్ద చెరువులుగా పేరుగాంచిన కందుకూరు వ్యాసరాయ సముద్రం చెరువు, పెద్దతిప్పసము ద్రం చెరువు అయిన తిప్పరాయసముద్రం చెరువు, రంగసముద్రంలోని రంగరాయ చెరువులు శ్రీకృష్ణదేవరాయలు నిర్మించినవే అని చరిత్ర చెబుతోందన్నారు. శాశ్వతమైన చెరువులు, దేవాలయాలు నిర్మించి ఎప్పటికీ శ్రీకృష్ణదేవరాయలు పేరు చిరస్థాయిగా నిలిచి పోయిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిహరప్రసాద్, మద్దయ్యగారిపల్లె హరి, పీటీఎంకు చెందిన సప్లయర్ సూరి, నారాయణ, సిమెంట్ రాజు, పూల శ్రీనాథ్, అక్కగారి మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో...

రామసముద్రం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలను మండల బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్‌లో శ్రీకృష్ణదేవరాయలు చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బేకరీ జనార్దన్, బలిజ సంఘం అధ్యక్షుడు గండోడి ఆంజప్ప, ఉపాధ్యక్షులు పాలాభత్తుల మంజునాథ్, బండ్ల జనార్ధన, కిశోర్ మొబైల్ కృష్ణమూర్తి, ఫోటో స్టూడియో శ్రీనివాస్, పార్లపల్లె సూరి, ఆంజప్ప, కోలా చిన్న, శంకరప్ప, ప్రకాష్, బలిజ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మండలంలో వైభవంగా ముద్దల దేవర



పెద్దమండ్యం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో ఆదివారం ముద్దల దేవర వైభవంగా జరిగింది. గ్రామాల్లో శాంతి జరగాలని అమ్మవార్లకు సలవ ముద్దలు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఎన్ఓపల్లి వడ్డిపల్లి గంగమ్మ తల్లి, నలగంగమ్మతల్లి, శివపురం, బుసిరెడ్డిగారిపల్లి, కోటకాడపల్లి, కలిచెర్ల, సిద్దవరం, గుర్రంవాండ్లపల్లి గ్రామాల్లో గంగమ్మ అమ్మవార్లకు వివిధ రకాల పుష్పాలతో అలకరించి సలవ ముద్దలు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన పండుగలు తలపించేలా గ్రామాల్లో సమీప బంధువులు, ఆడబిడ్డలను ఆహ్వానిస్తారు. పగలు, రాత్రి గ్రామ దేవతలు గంగమ్మ అమ్మవార్లకు ప్రత్యేక శాంతి పూజలు నిర్వహించారు. సోమవారం అన్నదానాలు జరుగుతాయి. అమ్మవార్లు శాంతింప జేస్తే గ్రామాల్లో శాంతి నెలకొంటుందని ఏటా గ్రామాల్లో ముద్దల దేవర చేస్తారని పెద్దలు వెల్లడించారు. గంగమ్మతల్లి పూజల్లో అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం - కేసు నమోదు

కలకడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఎర్రకోటపల్లె పంచాయితీ గొల్లపల్లె వాసి వివాహిత కవిత(36) ఇంటి నుంచి అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు సదరు గ్రామానికి చెందిన రెడ్డెప్ప భార్య కవిత 8వ తేదీ రాత్రి ఇంటి నుంచి అదృశ్యమైనట్లు తెలిపారు. ఈ క్రమంలో మహిళ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. భర్త రెడ్డెప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు


పీలేరులో మహిళల నుంచి వినతులు స్వీకరిస్తున్న నల్లారి తనూజా రెడ్డి

పీలేరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో ఉన్నప్పుడు టీడీపీ బలోపేతానికి కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు కల్పిస్తామని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ మహిళా శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారందరికీ తగిన గుర్తింపు కల్పించే బాధ్యతను తాను, తన భర్త కిశోర్ కుమార్ రెడ్డిదేనన్నారు. సమయానుకూలంగా అందరికీ తగిన విధంగా సాయం చేస్తామన్నారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో సమన్వయం చేసుకుంటూ అందరినీ కాపాడుకుంటామన్నారు. ప్రత్యేకంగా మహిళల అభ్యున్నతి కోసం తాను కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. పుంగనూరు, అంగళ్లు కేసుల సమయంలో నియోజకవర్గంలోని టీడీపీ మహిళా శ్రేణుల పోరాట పటిమను స్వయంగా చూశాని, వారందరినీ తగిన విధంగా గౌరవించుకుంటామన్నారు. నేతలు శ్రీకాంత్ రెడ్డి, పురం రామ్మూర్తి, అమరనాథరెడ్డి, పురం రెడ్డమ్మ, సాధన, రమాదేవి, స్వర్ణ, లక్ష్మీకాంతమ్మ, అనిత, అనూరాధ, ప్యారీజాన్, చంద్రలేఖ, మీనా, వాణి పాల్గొన్నారు.

గౌతమిని పరామర్శించిన ఎమ్మెల్యే


గౌతమిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల కిందట ప్రేమోన్మాది చేతిలో గాయపడిన గుర్రంకొండ మండలం, ప్యారంపల్లె వాసి జనార్ధన కుమార్తె గౌతమిని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా పరామర్శించారు. గణేశ్ దాడిలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతున్న ఆమెను ఎమ్మెల్యే పరామర్శించి డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందివ్వాలని కోరారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేష్ వీరి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని తెలియజేశారని చెప్పారు. ఆస్పత్రిలో చెల్లించే ప్రతి రూపాయి ప్రభుత్వం నుంచి చెల్లిస్తామని కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని రాష్ట్ర పర్యావరణ గతివిధి సంయోజక్ ఆదిశేషయ్య పేర్కొన్నారు. పట్టణంలో పీజీఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం పనిచేస్తున్న వెల్‌విషర్స్ సంస్థ ప్రతినిధి గిరీష్‌ను సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు సిద్దారెడ్డి, ఏపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ ఆంజనేయరెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, జనార్ధన్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి సేవలో ఎస్ఈ రమణ


ఎస్ఈ రమణను సన్మానిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి ఆలయంలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామిని ఆదివారం కడప ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఎస్ఈని సత్కరించి అమ్మవారి ప్రతిమను అందజేశారు. ఆయన వెంట కడప, అన్నమయ్య జిల్లాల ఈఈ, ఏడీఈ, ఏఈలు, ట్రాన్స్‌కో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆనందమే ప్రభుత్వ ధ్యేయం

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): దేశానికి వెన్నెముక లాంటి రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తంబళ్లపల్లె జనసేన ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన జనసేన, టీడీపీ నేతలతో కలిసి మండలంలో విస్తృతంగా పర్యటించారు. గుండ్లపల్లె చెంద్రాయని చెరువును పరిశీలించి చెరువు తూములు, కట్ట, కాల్వల పరిస్థితి, ఆయకట్టు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెరువు కట్ట దుస్థితి, తూము మరమ్మతులు, కాల్వల నిర్మాణాలపై ఆయకట్టు ఛైర్మెన్ వెంకట్రమణారెడ్డి, వైస్ ఛైర్మెన్ పెద్దప్పల్ల సాయినాథ్‌కు వివరించారు. అనంతరం గంగిరెడ్డిపల్లెలో వాటర్‌షెడ్ పనులను ప్రారంభించారు. ఆయన వెంట గుండ్లపల్లె మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ నాయుడు, జనసేన నేత సిద్దమల్‌రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి కాలానారాయణ, పెద్ద వీరభద్ర, నరేంద్రరెడ్డి, రైతులు ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ లోకేష్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం తంబళ్లపల్లె-మదనపల్లె రోడ్డులో కన్నెమడుగు మఠం వద్ద సిబ్బందితో కలసి వాహన తనిఖీ చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని, ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. రోడ్డు భద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు ఉండాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పీలేరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పీలేరులో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో కంటి సమస్యలతో 153 మంది హాజరుకాగా వారిలో శస్త్ర చికిత్స కోసం 23 మందిని ఎంపిక చేసి వారిని తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రికి తీసుకెళ్లారు నిర్వాహకులు. 22 మంది మహిళలు గర్భకోశ, రక్తహీనత, జనరల్ వ్యాధులతో 49 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు సోము రవికుమార్, అరవింద కంటి ఆస్పత్రి వైద్యురాలు గౌరీశంకర్, గైనకాలజిస్టు ఆయేషా ఖాతున్, రుయా ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, రుయా ఆస్పత్రి చీఫ్ నర్స్ లీలావతి, జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సురేంద్రనాథరెడ్డి, ఎన్‌సీసీ అధికారి జైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరీదేవి ఆలయంలో...


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. యువత సహకారంతో విశేషస్పందన వచ్చిందని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు అన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, కార్యదర్శి పవన్‌కుమార్, ట్రెజరర్ రామిశెట్టి రత్నమయ్య, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ - ముగ్గురికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలు ఢీ కొట్టుకోవడంతో ముగ్గురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వాయల్పాడు మండలం, చింతపర్తి వాసి వెంకటరమణ కుమారుడు శివప్రసాద్ భాస్కర కుమారుడు చందు ద్విచక్రవాహనంలో మదనపల్లెకు బయలుదేరారు. అదేగ్రామానికి చెందిన వెంకటరమణ భార్య భవానీ బైకుపై మదనపల్లెకు వచ్చి పనులు చూసుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా సీటీఎం పంచాయతీ పూలవాండ్లపల్లె వద్ద రెండు బైకులు ఢీ కొన్నాయి. ప్రమాదంలో గాయపడిన బాధితులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో శివప్రసాద్ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వర్గీకరణను రద్దు చేయాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను రద్దుచేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం డిమాండ్ చేశారు. ఆదివారం మదనపల్లె మాలమహానాడు కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ ఆగస్టు 23న తిరుపతిలో నిర్వహించే రాయలసీమ మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని, కమిషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన జనాభా మేరకు రిజర్వేషన్లు పెంచాలని, బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో గుండా మనోహర్, మల్లెలమోహన, చంద్రయ్య పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


కలశం చెంబులను అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మతల్లికి దాతలు ఆదివారం విరాళం అందజేశారు. చెన్నైకు చెందిన ప్రకాశ్‌బాబు రూ.50 వేలు నగదు, అమ్మవారి పూజకు వినియోగించే ఐదు కలశ చెంబులను వితరణగా ఈఓ మంజులకు అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయాభివృద్ధికి వినియోగించాలని దాతలు కోరారు. దాతలకు అమ్మ వారి దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వివేకానంద ఆశయ ఫౌండేషన్‌కు ఐఎస్ఓ గుర్తింపు

మదనపల్లె అర్బన, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నీరుగట్టువారిపల్లెకు చెందిన డాక్టర్ గుంపు భానుప్రకాష్ ఆధ్వర్యంలో నడుపుతున్న వివేకానంద ఆశయ ఫౌండేషన్ సంస్థకు ఐఎస్ఓ గుర్తిపు లభించినట్లు ఆయన అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అమెరికా సంస్థ నుంచి వీఏఎఫ్ సంస్థకు అంతర్జాతీయ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. వివేకానంద ఆశయ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.